సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులే

- సంగారెడ్డిలో సాయుధ పోరాట వారోత్సవ సభలో బివి రాఘవులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఒకేసారి ఎన్నికలంటే అధ్యక్షతరహా పాలన తీసుకురావడమేనని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. స్థానిక సంస్థలు, రాష్ట్రాల అధికారాలను హరించి ఒకే వ్యక్తి నియంతృత్వ పాలన సాగించడం కోసమే మోడీ జమిలీ జపం చేస్తున్నారని విమర్శించారు. వీర తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం సిపిఎం సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పిఎస్‌ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన సభకు రాఘవులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలోని వీరనారి ఐలమ్మ విగ్రహం నుంచి పిఎస్‌ఆర్ గార్డెన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ..

వీర తెలంగాణ సాయుధ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని రాఘవులు పునరుద్ఘాటించారు. నిజాం ప్రభువు లొంగిపోయినందునే సెప్టెంబర్ 17కు ప్రాధాన్యత సంతరించుకున్నదన్నారు. నిజాం లొంగిపోయేలా పోరాడిన కమ్యూనిస్టుల త్యాగాలను గుర్తించకుండా బిజెపి, కాంగ్రెస్, బిఆర్‌ఎస్ వంటి పార్టీలు తామేదో చేసినట్టు గొప్పలు చెప్పుకుంటున్నాయన్నారు. వెట్టి నుంచి ప్రజలను విముక్తి చేసి భూములను పంచిన చరిత్ర కమ్యూనిస్టులకు మాత్రమే ఉందన్నారు. దేశ సమైక్యతా దినంగా పాటిస్తున్నామని చెబుతున్న బిఆర్‌ఎస్ లేదా ఆ నాటి టిఆర్‌ఎస్‌కు సాయుధ పోరాటానికి ఏం సంబంధముందని ప్రశ్నించారు. వెట్టికి వ్యతిరేకంగా మట్టి మనుషులు సాగించిన విరోచితమైన వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి బిజెపి మతం రంగు పులుముతుందన్నారు. నిజాం ముస్లింగా ప్రజలంతా హిందువులుగా చెబుతూ రాజకీయ లబ్దిపొందేందుకు అమిత్ షా ప్రయత్నిస్తున్నారని తెలిపారు.

భూములు పంచిన చరిత్ర కమ్యూనిస్టులది : చుక్క రాములు

నిజాం పాలనలో భూములన్నీ జాగీర్దార్లు, జమీందార్ల చేతుల్లో ఉండేవని, వారికి వ్యతిరేకంగా భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో సాయుధ పోరాటం సాగించి లక్షలాది ఎకరాలను పేదలకు పంపిణీ చేశారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. సాయుధ పోరాటానికి ఎలాంటి సంబంధంలేని బిజెపి వాస్తవ చరిత్రను వక్రీకరిస్తోందని విమర్శించారు. పుచ్చలపల్లి సుందరయ్య, రావినారాయణరెడ్డి, భీంరెడ్డి నర్సింహ్మారెడ్డిలాంటి కమ్యూనిస్టుల యోధులు సాయుధ పోరాటానికి నాయకత్వం వహించారన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బీరం మల్లేశం, కె. రాజయ్య, అతిమేల మాణిక్యం, జిల్లా కమిటీ సభ్యులు యాదవరెడ్డి, నర్సింలు, ప్రవీణ్ కుమార్, ఎం. యాదగిరి, జిల్లా నాయకులు బాగారెడ్డి, రాజయ్య, అశోక్, పాండు రంగారెడ్డి, పి. కృష్ణ, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన నిరవధిక దీక్షలు 8వ రోజుకు చేరాయి. సంగారెడ్డిలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు చేస్తున్న దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 27 వేల మంది సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఉద్యమ కాలంలో.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానమే ఉండదని చెప్పిన కెసిఆర్ మాట నిలబెట్టుకోవడంలో విఫలమయ్యారని తెలిపారు. కెజిబివిలు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధి కోసం సేవలందిస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులకు సంబంధించిన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. సర్వశిక్షా అభియాన్ స్కీమ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఏర్పడినప్పటికీ అందులో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను నియమించింది రాష్ట్ర ప్రభుత్వమేనన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయకుండా కాలయాపన చేయడం సరైందికాదన్నారు. మహిళా ఉద్యోగులకు 180 రోజుల ప్రసూతి సెలవులు, మరణించిన ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియా ఇతర సమస్యలను కూడా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి సిపిఎం మద్దతుగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.రాజయ్య, అతిమేల మాణిక్యం, కృష్ణ, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు శేషాద్రి, కార్యదర్శి ఉమారాణి పాల్గొన్నారు.

సైబర్ టవర్ వద్ద దీక్ష

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేసిన కారణంగా టిటిడిపి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు హరికృష్ణ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని సైబర్ టవర్ వద్ద మౌన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా తెలుగుదేశం నాయకులు ఆయనకు మద్దతు ప్రకటించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐటీ రంగాన్ని నెలకొల్పి దేశ, విదేశాల్లో లక్షలాది మందికి ఉపాధి కల్పించి చంద్రబాబుపై తప్పుడు కేసు పెట్టడాన్ని ఆయన ఖండించారు. ఐటీ రంగంలో విద్యార్థులు, ఉద్యోగులు ఆర్థికంగా బలోపేతం కావడానికి, ముందు చూపుతో..భరోసాను మాజీ సీఎం చంద్రబాబు కల్పించారని గుర్తు చేశారు.

కోతుల్ని ఎలా కట్టడిచేద్దాం?

ఉన్నతాధికారులతో సిఎస్ సమీక్ష

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పంటలను దెబ్బతీస్తున్న కోతులను తక్షణం కట్టడి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారుల్ని ఆదేశించారు. సోమవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఆమె ప్రభుత్వ ఉన్నతాధికారులతో ఈ అంశంపై చర్చించారు. దీనికి సంబంధించి న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించినట్టు ఆమె తెలిపారు. కోతుల్ని పట్టుకొనే ఏజెన్సీల ప్రతినిధుల కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. దీనికి సంబంధించి నిపుణుల కమిటీ సభ్యులు స్వల్ప, దీర్ఘకాలిక ప్రణాళికల్ని సిఎస్‌కు అందచేశారు. ఆ ప్రణాళిక ప్రకారం క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సిఎస్ అధికారుల్ని ఆదేశించారు. సమావేశంలో పిసిసిఎఫ్ ఆర్‌ఎమ్ డోబ్రియాల్, పురపాలకశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అర్వింద్‌కుమార్, పశుసంవర్థక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అధర్ సిన్హా, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్‌ఎంసి) కమిషనర్ రోనాల్డ్ రోస్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లను ప్రభావితం చేసేందుకే ఓటర్ ఐడీ కార్డు

పిసిసి ఉపాధ్యక్షులు జి నిరంజన్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

గృహలక్ష్మి, దళితబంధు పథకాల్లో లబ్ధిదార్ల ఎంపిక కోసం ఓటర్ గుర్తింపు కార్డు సమర్పించాలంటూ ఒత్తిడి పెడుతున్నారని టిపిసిసి ఉపాధ్యక్షులు జి నిరంజన్ తెలిపారు. ఆ కార్డు ఇవ్వకపోతే వారి పేర్లు హోల్డ్‌లో పెడతామంటూ బెదిరిస్తున్నారని విమర్శించారు. ఇదే అంశంపై రాష్ట్ర ఎన్నికల అధికారికి లేఖ రాశారు. ఓటరు గుర్తింపుకార్డు సమర్పించాలనే జిఒ ఎక్కడా లేదన్నారు. లబ్ధిదారుల తుది జాబితాలో వారి పేర్లు గల్లంతైతే తమ బాధ్యత లేదని చెప్పడం సరైందికాదని పేర్కొన్నారు. వెంటనే దీనిపై ఉన్నతాధికారులకు ఆదేశాలివ్వాలని కోరారు.

వీడేం దొంగరా బాబూ!

- ఆర్‌టిసి బస్సునే చోరీ చేసి.. ప్రయాణికులకు ఎక్కించుకుని..
- డీజిల్ అయిపోయి బస్సు ఆగిపోవడంతో తుర్రుమన్న ఘనుడు
- ప్రయాణికుల గగ్గోలుతో తేరుకున్న అధికారులు
- ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టిన వైనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వీడో చిత్రమైన దొంగ.. ఆర్‌టిసి బస్సును దొంగిలించి.. డ్రైవర్‌లా ఫోజిచ్చి మరీ ప్రయాణికులను ఎక్కించుకున్నాడు. తీరా కొంత దూరం వెళ్లాక డీజిల్ అయిపోయి బస్సు ఆగిపోవడంతో అక్కడి నుంచి తుర్రుమన్నాడు. బస్టాండ్‌లో బస్సుపోయినా సోయిలేని అధికారులు చివరకు ప్రయాణికుల గగ్గోలుతో విషయం తెలుసుకుని తేరుకున్నారు. ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. పోలీసులు సదరు దొంగ కోసం వెతుకుతున్నారు. ఈ ఘటన సోమవారం సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి శివారులో జరిగింది.

సిద్దిపేట బస్టాండ్‌లో ఉదయం ఆరు గంటలకు ఓ ఎక్స్‌ప్రెస్ బస్సు వేములవాడకు వచ్చేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలో డ్రైవర్, కండక్టర్ లేని సమయం చూసి ఓ దొంగ ఆ బస్సును చోరీ చేశాడు. నీలిరంగు చొక్కా, ప్యాంటు తొడిగి అచ్చం డ్రైవర్‌లా ఫోజిచ్చి డ్రైవర్ సీట్లో కూర్చొని సిద్దిపేట నుంచి మధ్యాహ్నం వేములవాడ బస్టాండ్‌కు బస్సు తీసుకొచ్చాడు. అక్కడ హైదరాబాద్ బోర్డు మార్చి ప్రయాణికులను ఎక్కించుకున్నాడు. బస్సు కొంత దూరం వెళ్లి సిరిసిల్ల జిల్లా కేంద్రం దాటుతుండగా.. కండక్టర్ ఏడని ప్రశ్నించిన ప్రయాణికులకు మధ్యలో బస్సు ఎక్కుతాడని సదరు చోరుడు బదులిచ్చాడు. తంగళ్లపల్లి వచ్చినా ఇంకా బస్సు ఎక్కని కండక్టర్ కోసం ఎదురుచూస్తున్నారు. సారంపల్లి గ్రామ శివారుకు రాగానే బస్సులో డీజిల్ అయిపోయి ఆగిపోయింది. ఏమైందని కిందికి దిగిన ప్రయాణికులకు వేరే బస్సు ఎక్కడండని ఆ దొంగ బదులిచ్చాడు. కండక్టర్ లేకపోవడం, డ్రైవర్ మాటలు నమ్మశక్యంగా లేకపోవడంతో పలువురు అతన్ని నిలదీశారు. కొందరు అతన్ని వీడియో కూడా తీశారు. సరైన సమాధానం చెప్పకుండా మెల్లిగా అక్కడి నుంచి రోడ్డు దిగి తుర్రుమన్నాడు. దీంతో ప్రయాణికులు

ఆగ్రహంతో విషయాన్ని ఆర్‌టిసి అధికారులకు తెలియజేశారు. ఏం జరిగిందో అర్థంకాక వేములవాడ ఆర్‌టిసి అధికారులు ఘటనస్థలానికి చేరుకోగా.. అసలీ బస్సు ఎక్కడిదని ఆరా తీశారు. సిద్దిపేట బస్టాండ్‌లో ఉదయం చోరీకి గురైన బస్సు ఇదేనని నిర్ధారించుకున్నారు. బస్సు చోరీ అయిన విషయాన్ని పోలీసులకు, సిద్దిపేట అధికారులకు తెలియజేశారు. దొంగ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ విషయమై వేములవాడ డిపో మేనేజర్ మనోహర్‌ను వివరణ కోరగా.. సిద్దిపేట డిపో ముందున ఆర్‌టిసి బస్సు చోరీకి గురైన విషయం వాస్తవమేనని, సదరు బస్సు డ్రైవర్ డిపోలో రిపోర్టు చేయలేదని తెలిపారు. చోరీ అయిన బస్సు వేములవాడలో ప్రత్యక్షమైన ఉదంతంపై విచారణ చేశామని, సిద్దిపేటలో కేసు దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారని చెప్పారు.

అటవీ రక్షణలో అమరులకు శ్రద్ధాంజలి : సిఎం కెసిఆర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అటవీ రక్షణ కోసం కార్యదీక్షతో పనిచేస్తూ విధి నిర్వహణలో అమరులైన 22 మంది అధికారులు, సిబ్బందికి సిఎం కెసిఆర్ శ్రద్ధాంజలి ఘటించారు. వారి అంకిత భావం మనందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంలో భాగంగా జంగల్ బచావో-జంగల్ బడావో నినాదాన్ని చిత్తశుద్ధితో అమలు చేయాలనీ, ఈ విషయంలో ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ తీసుకోవాలని పిలుపునిచ్చారు. అటవీ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సిఎంఒ కార్యాలయం సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. 'రాష్ట్రంలో అడవుల శాతాన్ని పెంచేందుకు అటవీ శాఖ చేస్తున్న ప్రయత్నాలు ప్రశంసనీయం. హరిత తెలంగాణ కోసం మన లక్షిత పచ్చదనం 33 శాతం సాధించేదాకా కలిసికట్టుగా పనిచేద్దాం' అని పిలుపునిచ్చారు. తెలంగాణకు హరితహారం కార్యక్రమానికి అందరి నుంచీ మద్దతు లభించటంతో ఇవాళ అద్భుతమైన ఫలితాలను చూస్తున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్ లాంటి కాంక్రీట్ కీకారణ్యంలో కూడా ఊహించనంత పచ్చదనం పెరిగిందని తెలిపారు. అంతర్జాతీయ ఉద్యానవన ఉత్పత్తిదారుల సంఘం అందించే వరల్డ్ గ్రీన్ సిటీ అవార్డ్ – 2022 హైదరాబాద్‌కు దక్కటమే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఎంత అందుబాటులోకి వచ్చినా, ఎంత అభివృద్ధి సాధించినా ప్రకృతి పరిరక్షణే ప్రాథమిక ధ్యేయంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని కోరారు. భవిష్యత్ తరాలు కూడా ఈ పుడమిపై జీవించే హక్కును కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని గుర్తుచేశారు.

అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No.04/2022
బిట్వీన్
గోరంట్ల విజయచందు ...... వాది
వర్సెస్
1) పేర్ని స్వరాజ్యలక్ష్మి మరియు వగైరాలు ..... ప్రతివాదులు
టు
పేర్ని శ్రావణ్ S/o వీరనారాయణ
R/O A. R.C ఇంటర్నేషనల్ 901.
MIL. VL. NJ, U.S.A
పై తెలిపిన దావాలో మీరు మూడవ ప్రతివాది అయి ఉన్నారు. కోర్టు వారు పలు పర్యాయములు నోటీసులు ద్వారా తెలియజేసి ఉన్నారు. కానీ మీరు దానికి సమాధానం పరచ నందున పేపరు పబ్లికేషన్ ద్వారా తెలియజేయడమైనది. అందులకు కోర్టు వారు తేది 21-9-2023 న ఉదయం10.30 ని.లకు మీరు కానీ మీ వకీల్ ద్వారా కానీ హాజరు కావలసినది. లేని యెడల నీ మీద పరోక్షంగా తీర్పు చెప్పెదరు. ఇందుమూలముగా తెలియజేయడమైనది.
వాయిదా తేది : 21.9.2023
// కోర్టు వారి ఉత్తర్వులు మేరకు //
ఇట్లు
గూడాల అంజిరెడ్డి
వాది తరపున
న్యాయవాది,అద్దంకి.

సాయుధ దళాల కోసం మానవరహిత యుజివి అభివృద్ధి

- స్టార్టప్ అరోబోట్ వెల్లడి

హైదరాబాద్: ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ తయారీలో ఉన్న రఘువంశీ గ్రూప్, పార్ ఈస్టల భాగస్వామ్యంలోని స్టార్టప్ సంస్థ అరోబోట్ కొత్తగా సాయుధ దళాల కోసం మానవరహిత గైడెడ్ వెహికిల్ (యుజివి)ను అభివృద్ధి చేసినట్లు వెల్లడించింది. ఇది సైన్యానికి రవాణా, నిఘా, క్లిష్టమైన వాతావరణ పరిస్థితులు, ఉపరితలాల్లో ఎంతో సహాయపడుతుందని పేర్కొంది. ఇది 200 కిలోల వరకు బరువును 30 డిగ్రీల వ్యూతో లక్ష్యాన్ని నిర్దేశించుకోగలదు. దీనికి అదనపు ఎటాచ్‌మెంట్లు పెడితే ఇంకా అనేక ఇతర విధులను కూడా చేయగలదని ఆ సంస్థ తెలిపింది. "డిజిటలైజేషన్, ఎలక్ట్రానిక్స్, ఆటోమేషన్ రంగాల్లో మా స్టార్టప్ దూసుకెళ్తోంది. అత్యాధునిక పరిష్కారాలను అందించడం ద్వారా, ఆధునిక యుగంలో అభివృద్ధి చెందడానికి అవసరమైన సాధనాలతో పరిశ్రమలను శక్తివంతం చేయాలని అరోబోట్ యోచిస్తోంది" అని అరోబోట్ సహ వ్యవస్థాపకుడు, సిఇఒ రవి ఆచంట తెలిపారు. వచ్చే ఏడాదిలోగా కొత్తగా 100 మంది ఉద్యోగాలను కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. "రఘువంశీ గ్రూపులో మా విలువైన వినియోగదారులకు వినూత్న సాంకేతిక పరిష్కారాలను అందించడానికి మాకు ఎనలేని నిబద్ధత ఉంది. మిస్సైల్ సిస్టమ్స్, ఎలక్ట్రో ఆప్టిక్స్, జెట్ ఇంజిన్లు, లోయిటరింగ్ మారణాయుధాలు, డ్రోన్లు, మరెన్నో రంగాలలో అత్యాధునిక ఉత్పత్తులను అభివద్ధి చేయడానికి మాకు వీలు కల్పించే అన్ని ప్రధాన తయారీ డొమైన్లలో అంతర్గత నైపుణ్యాన్ని కలిగి ఉన్న కొన్ని సంస్థలలో మేము ఉండటం నిజంగా గర్వకారణం" అని రఘువంశీ గ్రూపు ఎండి వంశీ వికాస్ పేర్కొన్నారు.

బిజెపి,ఆర్‌ఎస్‌ఎస్ హటావో మోడీ పాలనలో నిరుద్యోగ తాండవం

- మహిళా వ్యతిరేక విధానాలకు నిరసనగా అక్టోబర్ 5న ఛలో ఢిల్లీ
- విలేకర్ల సమావేశంలో పుణ్యవతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని మోడీ సర్కార్ మహిళా వ్యతిరేక దురహంకారాన్ని ప్రదర్శిస్తున్నదని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జాతీయ నేత ఎస్ పుణ్యవతి విమర్శించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, అధ్యక్ష, ఉపాధ్యక్షులు అరుణజ్యోతి, కేఎన్ ఆశాలత, బి హైమావతితో కలిసి ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. 'బిజెపి.. ఆర్‌ఎస్‌ఎస్ హటావో..మహిళా బచావో' నినాదంతో వచ్చే నెల 5న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు. వేలాది మంది మహిళలు దేశవ్యాప్తంగా మహార్యాలీకి ఇప్పటికే సమాయత్తమవుతున్నట్టు తెలిపారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై దారుణమైన హింస కొనసాగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా రక్షణకోసం పనిచేయాల్సిన చట్టాలు ఉద్దేశ పూర్వకంగానే నీరుగార్చబడుతున్నాయన్నారు. రోజురోజుకు పెరుగుతున్న హింసకు వ్యతిరేకంగా మహిళలు సంఘటితంగా పోరుబాట పట్టాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని తెలిపారు. మరోపక్క దేశంలో ఆకలి చావులు పెరుగుతున్నాయన్నారు. దారిద్ర్యాన్ని మరింత పెంచే విధంగా మోడీ పాలనా విధానాలున్నాయన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ క్రమంగా నిర్వీర్యం అవుతున్నదని చెప్పారు. పేదలకు ఇవ్వాల్సిన సబ్సిడీల్లో కోతలు విధిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. గ్యాస్ బండలు ఉచితంగా ఇస్తామంటూ నమ్మబలికి..మాట తప్పారని తెలిపారు. ఉజ్వల పథకానికి ఉద్వాసన పలికి..దాన్ని అటకెక్కించారని విమర్శించారు. రోజురోజుకు మహిళలపై హింస పెరుగుతున్నదన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని క్రమంగా నీరుగారుస్తున్నారని చెప్పారు. అటవీ హక్కుల చట్టాన్ని కాలరాస్తూ అక్కడున్న విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్లకు ధారాదత్తం చేసే కుట్రకు మోడీ ప్రభుత్వం పాల్పడుతున్నదని చెప్పారు. అందులో భాగమే మణిపూర్ మారణహోమం అన్నారు. ఈ నేపథ్యంలోనే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

- సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీల సమరం
- అధికారుల బెదిరింపులు
- కేంద్రాల తాళాలు పగులగొట్టి నిర్వహణ
- సిఐటియు నేతలు, అంగన్‌వాడీల అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం పెద్దఎత్తున ధర్నా చేశారు. గ్రామాలు, మండలాల నుంచి తరలివచ్చి తహశీల్దార్ కార్యాలయాలు, కలెక్టరేట్ల ఎదుట దీక్షా శిబిరాల్లో కూర్చున్నారు. భారీ ర్యాలీలు తీశారు. అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేసి కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెన్ఫిట్స్ టీచర్లకు రూ.10 లక్షలు, ఆయాలకు రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. అయితే, సమస్యల పరిష్కారానికి చొరవ చూపని అధికారులు అంగన్‌వాడీలపై బెదిరింపులకు పాల్పడటంతోపాటు కొన్నిచోట్ల కేంద్రాల తాళాలు పగులగొట్టి తెరిపించారు. కామారెడ్డిలో కేంద్రాలను తెరిపించే ప్రయత్నం చేయగా సిఐటియు నేతలు అడ్డుకున్నారు. పలుచోట్ల సిఐటియు నేతలు, అంగన్‌వాడీలను పోలీసులు అరెస్టు చేశారు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా సమ్మె చేపట్టారు. చేవెళ్లలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మహేశ్వరంలో మానవహారం నిర్వహించారు. యాచారంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం తహశీల్దార్ శ్రీకాంత్‌రెడ్డికి సమ్మె నోటీసు అందజేశారు. ఖమ్మం జిల్లా కామేపల్లి మండల కేంద్రంలో అంగన్‌వాడీల దీక్షను సిఐటియు జిల్లా కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ దీక్షకు సిపిఎం, సిపిఐ,

ప్రజాపంథా నాయకులు సంఘీభావం తెలిపారు. కల్లూరులో ర్యాలీ, కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలో అంగన్‌వాడీలు దీక్ష ప్రారంభించారు. భద్రాచలంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట దీక్ష చేపట్టారు. బూర్గంపాడు, పాల్వంచలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఏజె రమేష్ దీక్షలను ప్రారంభించారు. మేడ్చల్ మల్కాజిగిరి ఎమ్మార్వో ఆఫీస్ వద్ద నిరసన తెలిపి ఎమ్మార్వో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఉప్పల్ తహసీల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడీ టీచర్లు ఆందోళన నిర్వహించారు. దుండిగల్ మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ మండల కన్వీనర్ లింగస్వామి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ ఉద్యోగులు సమ్మెకు దిగారు. కలెక్టరేట్లు, అన్ని మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట సమ్మె శిబిరాలు ఏర్పాటు చేశారు. ఐసిడిఎస్ అధికారులు కేంద్రాలను తెరవాలని బెదిరింపులకు పాల్పడ్డారు. పలుచోట్ల కేంద్రాల తాళాలను పగులగొట్టి ఐకేపీ సిబ్బందితో నిర్వహించారు.

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సమ్మె చేపట్టనీయకుండా అంగన్‌వాడీలను అరెస్టు చేసి మోపాల్‌లోని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని సిడిపిఒ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో సమ్మె చేపట్టారు. ఈ సమ్మెనుద్దేశించి సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి మాట్లాడారు. దేవరకొండ ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. జిల్లా అధికారి జ్యోతి పద్మకు సమ్మె నోటీస్ అందజేశారు. ములుగు జిల్లా కేంద్రంలో గాంధీ విగ్రహం ముందు నిరవధిక సమ్మె ప్రారంభించారు. అంతకు ముందే సిఐటియు జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఆ తరువాత శాంతి యుతంగా సమ్మె చేస్తున్న అంగన్వాడీ టీచర్స్ టెంట్ తొలగించి 50 మందిని అక్రమంగా అరెస్టు చేసి ములుగు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఐసిడిఎస్ అధికారులు గోవిందరావు పేట, పస్రా సెక్టార్‌లలోని నాలుగు అంగన్వాడీ సెంటర్ల తాళాలు పగులగొట్టి తెరిచారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలో అంగన్‌వాడీ ఉద్యోగులను ముందస్తుగా పోలీసులు అరెస్టు చేశారు. మహబూబాబాద్ జిల్లా మానుకోటలో భారీ ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.

సమస్యలను సామరస్యంగా పరిష్కరించాలి

- తెలంగాణ అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ జెఏసి నేతలు పి.జయలక్ష్మి, ఎన్. కరుణకుమారి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పర్మినెంట్, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వడంతో పాటు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వర్తింపజేయడం, పెన్షన్ పెంపు వంటి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని సమ్మె చేస్తున్న అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధ కాండను ప్రయోగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ జెఎసి నేతలు పి.జయలక్ష్మి (సిఐటియు), ఎన్.కరుణకుమారి (ఎఐటియుసి) తెలిపారు. టీచర్లు, హెల్పర్లపై బెదిరింపులను మానుకోవాలని సూచించారు. సమ్మె డిమాండ్లను సామరస్యంగా పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ట్రేడ్ యూనియన్ చట్టం 1926 ప్రకారం చట్టబద్ధంగా 14 రోజుల ముందు ప్రభుత్వానికి, సంబంధిత రాష్ట్ర అధికారులకు సమ్మె నోటీసు ఇచ్చినా పట్టించుకోలేదని విమర్శించారు. చట్టబద్ధంగా చేస్తున్న సమ్మెను అణచివేయాలని చూడటం సరిగాదని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల తాళాలను పగులగొట్టడం అత్యంత దుర్మార్గమని వాపోయారు. అంగన్వాడీ ఉద్యోగులను ఇండ్ల వద్దకెళ్లి మరీ అరెస్టు చేయడం అన్యాయమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన అప్రజాస్వామిక విధానాలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని సూచించారు. లేదంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అసైన్డ్ భూములను గుంజుకుంటోంది

- మాజీ ఎంపి వి హనుమంతరావు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పేదల భూములు, అసైన్డ్ భూములను రాష్ట్ర ప్రభుత్వం గుంజుకుని వెంచర్లకు అమ్మేస్తున్నదని మాజీ ఎంపీ వి హనుమంతరావు విమర్శించారు. అదే తరహాలో ఖానాపూర్, కొకాపేట భూములను అమ్మిందన్నారు. ఇందిరా గాంధీ హయాంలో ఇచ్చిన అసైన్డ్ భూములను విక్రయిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షులు కోదండరెడ్డితో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. మోడీ, కెసిఆర్ ప్రభుత్వం భూస్వాములకు, కార్పొరేట్లకు ఉపయోగపడుతుందన్నారు. పేదలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎకరాకు రూ. 100 కోట్లకు అమ్మే పరిస్థితి వచ్చిందన్నారు. భవిష్యత్తులో పేదలు ఫుట్‌పాత్ మీద పడుకునే పరిస్థితి వస్తుందన్నారు. పేదవాడికి ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ కాంగ్రెస్ ఉంటుందని చెప్పారు. సిఎం కెసిఆర్ మల్టీనేషనల్ కంపెనీకి రెండువేల ఎకరాల అసైన్డ్ భూములను అప్పజేప్పిందన్నారు. హైదరాబాద్ చుట్టూ పక్కల ఉన్నా విలువైన భూముల్లో 300 గజాలు ఇస్తున్నామని చెప్పి ఇతర భూములను వేల కోట్లకు అమ్ముకున్నారని విమర్శించారు.

IN THE COURT OF THE HON'BLE CHAIRMAN MACT CUM XXVI ADDL CHIEF JUDGE, CITY CIVIL COURT
AT: HYDERABAD
M.V.OP. NO. 1120 OF 2023
Between:
Malototh Sangram. ...Petitioner
And
Suresh and Others. ...Respondents
To,
1. Durga Anil,S/o.Sangaiah,Occ:Bus Driver,R/o.Regoad Village,Regod Mandal,Medak Dist.(Driver of Bus Bearing No.TS 15 UA 6100) ...Respondent 4
Please take Notice that the above named Petitioner filed above O P against you and other for Compensation, Praying that the Hon'ble court for grant of compensation in favor of the petitioner. The Hon'ble Court posted the above case on 25 -09-2023.at 10.30 am for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.
(BY ORDER OF COURT)
M/s. M.Vishwanath,
Advocate
R/o.H.No.6-3-354/8/6,
Hindinagar,Punjagutta,Hyderabad.

IN THE COURT OF THE HON'BLE V SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURT
AT : HYDERABAD
O.S. NO. 322 OF 2023
Between:-
1. Smt. Bandari Anitha
W/o. Late B. Srikanth, Age 40 years
Occ: Household
2. Master Bandari Sathvik
S/o. Late B. Srikanth, Age 14 years
Occ : Student
3. Master Bandari Rithik
S/o. Late B. Srikanth, Age 11 years
Occ : Student
Plaintiffs Nos. 2 and 3 are minors and they are represented by their Mother Plaintiff No.1 as natural guardian.
All are R/o.H.No.11-3-357/16/3/14/1, Parsigutta, Srinivasa Nagar, Shahbazguda, Secunderabad. T.S. 500 061 .....Plaintiffs
AND
1. Tahsildar / The Mandal Revenue Officer Musheerabad Mandal, Hyderabad.
2. All concerned .....Defendants
To,
All concerned.
Please take notice that the above named Plaintiffs have filed the above suit for Declaration to declare the plaintiffs as legal heirs of Late B. Srikanth and the case is posted on **13-09-2023**. If anybody having any objections, they are hereby directed to appear before the above mentioned court on the above said date at 10.30.A.M. either in person or through an Advocate, if failed to appear before the court, the matter will be decided as per law.
// By the Order of the Court //
A. SANJEEVA NARAYAN, ADVOCATE
Office : 1-9-18/2/5, Ram Nagar X Roads, Hyderabad. - 500 020
Cell: 9348589496

సైనిక్‌పురిలో కంట్రీ చికెన్ కో అవుట్‌లెట్ ఏర్పాటు

- ప్రారంభించిన మంత్రి మల్లారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్
అత్యంత ప్రీమియం కంట్రీ చికెన్ బ్రాండ్ 'కంట్రీ చికెన్ కో' 6వ అవుట్‌లెట్‌ను సైనిక్‌పురిలో ఏర్పాటు చేసింది. దీనిని కార్మిక, ఉపాధి శాఖ మంత్రి సి మల్లా రెడ్డి లాంచనంగా ప్రారంభించారు. నాటుకోడి రుచి అమోఘమని మల్లారెడ్డి పేర్కొన్నారు. ఈ బ్రాండ్ మరింతగా విస్తరించాలన్నారు. ఇవాళ రేపు ఈ బ్రాయిలర్ తింటుంటే లేనిపోని రోగాలు వస్తున్నాయని తెలిపారు. ఈ ప్రారంభోత్సవంలో కంట్రీ చికెన్ ఫౌండర్, సిఇఒ జి సాయికేష్ గౌడ్, సిఒఒ మహ్మద్ సమీ ఉద్దీన్ పాల్గొన్నారు.

క్యాంపస్ నియామకాల్లో 'డెలివరూ'

ప్రజాశక్తి - హైదరాబాద్
యూనివర్శిటీల్లో క్యాంపస్ నియామకాలు చేపడుతున్నామని గ్లోబల్ ఫుడ్ డెలివరీ కంపెనీ డెలివరూ తెలిపింది. రాష్ట్రంలోని ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల నుండి విద్యార్థులను ఉద్యోగాలలో నియమించుకునే లక్ష్యంతో ప్రత్యేక క్యాంపెయిన్‌ను చేపడుతున్నామని పేర్కొంది. హైదరాబాద్‌లో ఉన్న తమ డెవలప్‌మెంట్ సెంటర్‌లో పని చేసే అవకాశాన్ని కల్పిస్తున్నామని డెలివరూ ఇండియా వైస్ ప్రెసిడెంట్, కంట్రీ హెడ్ శశి సోమవరపు తెలిపారు. ఇందుకోసం ఐఐఐటి హైదరాబాద్, ఎన్ఐటి వరంగల్, చైతన్య భారతీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సిబిఐటి), వాసవి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ తదితర విద్యాసంస్థల్లో క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లు చేపట్టాలని యోచించామన్నారు.

మానిటైజేషన్‌కు వ్యతిరేకంగా

- బిడిఎల్ ఉద్యోగులు ఉద్యమించాలి
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు బాస్కర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల భూముల మానిటైజేషన్ నిర్ణయానికి వ్యతిరేకంగా బిడిఎల్ ఉద్యోగులంతా ఐక్యంగా ఉద్యమించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని సిఐటియు నగర కార్యాలయంలో బిడిఇయు (సిఐటియు అనుబంధం) సమావేశం ఎ.బాపూరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సిపిఎస్‌యు భూములను సైతం అమ్మకానికి పెట్టడం అన్యాయమన్నారు. ఆర్డర్లు ఇవ్వకుండా ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేయడం దారుణమన్నారు. కార్మికులను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించడం, కాంట్రాక్ట్ విధానాన్ని కొనసాగించడం, వేతన సవరణలు చేయకుండా దాటవేయడం అన్యాయమన్నారు. ఈ చర్యలను ప్రతిఘటిస్తూ బిడిఎల్ ఉద్యోగులు రాజకీయాలకతీతంగా పోరాడాలని కోరారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్ మాట్లాడుతూ..ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం త్వరలో శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై ఆందోళనా కార్యక్రమాలు చేస్తామన్నారు.

బిడిఇయు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎ.బాపూరావు, యాదగిరి

బిడిఇయు ప్రధాన కార్యదర్శిగా యాదగిరి, అధ్యక్షులుగా ఎ.బాపూరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అడిషనల్ ప్రధాన కార్యదర్శిగా టి. సత్తయ్య, కోశాధికారిగా ఎం. రవీందర్, అడ్వైజర్‌గా జి.ఆర్. విజయ్ కుమార్‌లను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. యూనియన్ అధ్యక్షులు ఎ.బాపూరావు బిడిఎల్ కంపెనీ ప్రస్తుత పరిస్థితులను వివరించారు.

ఇళ్ల స్థలాల పోరాటం ప్రారంభం

- పేదలకు భూపంపిణీలో సిఎం విఫలం
- మాజీ ఎంపి మిడియం బాబూరావు

జెండా పాతి ఇళ్ల స్థలాల పోరాటాన్ని ప్రారంభిస్తున్న బాబూరావు, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
ములుగు జిల్లా వాజేడు మండలం మండపాక గ్రామంలోని ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాల పోరాటాన్ని మాజీ ఎంపి, సిపిఎం రాష్ట్ర నాయకులు డాక్టర్ మిడియం బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి కృష్ణారెడ్డి, మచ్చ వెంకటేశ్వర్లు సోమవారం జెండా పాతి ప్రారంభించారు. అనంతరం వాజేడు మండల కార్యదర్శి కొప్పుల రఘుపతి అధ్యక్షతన జరిగిన సభలో బాబూరావు మాట్లాడుతూ.. గడిచిన 70 ఏళ్లుగా వారి సమస్యలపై గిరిజనులు, గిరిజ నేతరులు పోరాటాలు చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారికి న్యాయం చేసిన పరిస్థితి లేదన్నారు. పెట్టుబడి దారులకు భూములు ఉచితంగా ఇస్తూ పేదలను విస్మరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఎక్కడ ప్రభుత్వ భూమి ఉంటే అక్కడ పేదలకు ఇస్తామన్న సిఎం కెసిఆర్.. అమలులో విఫలమయ్యారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎర్రజెండా నాయకత్వంలో అనేక దఫాలుగా ఉద్యమాలు చేపట్టినా ప్రభుత్వం నిమ్మకు నిరేత్తినట్టుగా వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద ప్రజలు ఐక్యమై ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. వాజేడు మండలంలో అనేకమంది ప్రజలు ఇళ్లు లేని పరిస్థితిలో ఉన్నారన్నారు. ఇళ్ల సాధనకు రెండు దఫాలు ఉద్యమాలు నిర్వహించామని, జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాలిచ్చినా ఫలితం లేదన్నారు. ఈ క్రమంలో మండపాక సెంటర్‌లోని ప్రభుత్వ భూమి సర్వేనెంబర్ 11లో 25 గ్రామాల నుంచి 600 మంది పేదలు గుడిసెలు వేసుకున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ భూమిలో పేదలకు పట్టాలివ్వాలని, లేదంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో భద్రాచలం నియోజకవర్గం కో కన్వీనర్ కారం పుల్లయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బీరెడ్డి సాంబశివ, గ్యానం వాసు, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై బైటాయించి నిరసన తెలుపుతున్న రైతులు

రుణమాఫీ కోసం రైతుల రాస్తారోకో

- 'రెన్యువల్ చేయడమే తప్పా' అంటూ ఆవేదన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేస్తానని జిఒ విడుదల చేసి నెల రోజులు గడుస్తున్నా ఖాతాల్లో జమ కాలేదంటూ రైతులు రాస్తారోకో చేశారు. నల్లగొండ జిల్లా మునుగోడు మండలంలో మునుగోడు నుంచి చౌటుప్పల్‌కి వెళ్లే ప్రధాన రహదారిపై కొంపెల్లి కెనరా బ్యాంక్ ఎదుట రైతులు, ప్రజాప్రతినిధులు సోమవారం రాస్తారోకోకు దిగారు. ఈ సందర్భంగా కొంపల్లి సర్పంచ్ జాల వెంకన్న యాదవ్, వెల్మకన్న ఎంపిటిసి చాపల మారయ్య, కల్వకుంట్ల సర్పంచ్ పగిళ్ల బిక్షం మాట్లాడారు. కెనరా బ్యాంక్‌లో క్రాప్‌లోను తీసుకుని ప్రతి ఏడాదీ రెన్యువల్ చేసుకున్న రైతులకు అధికారుల నిర్లక్ష్యం కారణంగా రుణమాఫీ కాలేదన్నారు. 2018లో రుణం తీసుకుని ఇప్పటి వరకు బ్యాంకు ముఖం చూడని వారికి రుణమాఫీ అయిందని, రెన్యువల్ చేసుకున్న రైతులకు మాఫీ కాక తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి లోను రెన్యువల్ చేసుకున్న రైతుల ఖాతాల్లోనూ లక్ష రూపాయల రుణమాఫీని జమ చేయాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ వినకపోవడంతో కెనరా బ్యాంక్ ఎజిఎంతో ఫోన్లో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. ఈ కార్యక్రమంలో టిడిపి భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మక్కెన అప్పారావు, మాజీ సర్పంచులు జీడిమెట్ల నరసింహ, బోయపర్తి లింగయ్య, బిఆర్ఎస్ నాయకులు ఎడ్ల రామలింగయ్య, వీరమల్ల వెంకట్రావు, జీడిమెట్ల పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

భిన్న ప్రాంతాల నాటక ప్రదర్శనలు

దేశ సంస్కృతి ప్రతిబింబిస్తాయి

సంగీత నాటక అకాడమీ చైర్మన్ దీపికా రెడ్డి

ప్రజాశక్తి - కల్చరల్
భిన్న ప్రాంతాల నాటక ప్రదర్శనలు దేశసంస్కృతిని ప్రతిభింభిస్తాయని సంగీత నాటక అకాడెమీ చైర్మన్ దీపికా రెడ్డి అన్నారు. రవీంద్రభారతి ప్రధాన వేదికపై భాషా సాంస్కృతిక శాఖ, సంగీత నాటక అకాడమీ, కేంద్ర సాంస్కృతిక శాఖ, దక్షిణ ప్రాంత సాంస్కృతిక కేంద్రం సహకారంతో అభినయ థియేటర్ ట్రస్ట్ నిర్వహణలో నేషనల్ థియేటర్ ఫెస్టివల్ 2023 జాతీయ బహుభాషా నాటకొత్సవం అరంభమైంది. ముఖ్య అతిథిగా దీపికా రెడ్డి పాల్గొని మాట్లాడుతూ పలు సంస్కృతుల సమ్మేళనం భారత దేశం అన్నారు. వేరు వేరు భాషలకు చెందిన నాటకాలు వొక వేదికపై ప్రదర్శనకు సమకట్టిన అభినయ శ్రీనివాస్ అభినందనీయుడు అన్నారు. సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్.మామిడి హరికృష్ణ మాట్లాడుతూ హైదరాబాద్ నగరం పలు భాషల వారికి నిలయమన్నరు. వేరే ప్రాంతం వారిని మనలో ఒకరు భావించే సంస్కారం తెలంగాణా వారిది అన్నారు .విశ్రాంత సివిల్స్ సర్వీసెస్ ఉన్నతాధికారి చెల్లప్ప, వాసుదేవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అభినయ శ్రీనివాస్ కార్యక్రమాన్ని పర్యవేక్షణ చేశారు.

15న ఆర్‌టిసి కార్మికుల నిరసన

- పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి : జెఎసి డిమాండ్

సమావేశంలో మాట్లాడుతున్న జెఎసి నాయకులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
టిఎస్ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయడానికంటే ముందే కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 15న నల్లబ్యాడ్జీలతో నిరసనలు తెలపాలని టిఎస్ఆర్‌టిసి కార్మిక సంఘాల జెఎసి పిలుపునిచ్చింది. టిఎస్ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో చైర్మన్ కె రాజిరెడ్డి అధ్యక్షతన జెఎసి సమావేశం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోలు, యునిట్లలో డిమాండ్స్ బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్మికులకు అనుకూలమైన సమయంలో 'ధర్నా' చేయాలని చెప్పారు. అప్పటికీ యాజమాన్యం, ప్రభుత్వం స్పందించని పక్షంలో ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఆర్‌టిసి కార్మికులకు 2017 నుంచి రావలసిన వేతన సవరణను ఆ నాటి బేసిక్ పే కు 31.1 శాతం డిఎను కలిపి 30 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ జరపి, పాత బకాయిలతో కలిసి చెల్లించేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు. అలాగే 2021 వేతన సవరణ ప్రభుత్వ ఉద్యోగులతో పాటు సమానంగా చేస్తూ మాస్టర్ పే స్కేల్‌లో ఫిక్సేషన్ చేయాలని డిమాండ్ చేశారు. 2013 వేతన సవరణ 50 శాతం బకాయిల బాండ్ల డబ్బులు ఇప్పటి వరకూ ఇవ్వలేదనీ, వాటిని 8.75 శాతం వడ్డీతో కలిపి చెల్లించాలని కోరారు. ఈ ఏడాది జనవరి, జులై మాసాల్లో రావల్సిన డిఎలు, మొత్తం తొమ్మిది డిఎల బకాయిల సొమ్ము చెల్లించాలని డిమాండ్ చేశారు. సిసిఎస్‌కు అసలు, వడ్డీ కలిసి యాజమాన్యం రూ.1,078 కోట్లు ఇవ్వాలని, వాటితో పాటు ఎస్ఆర్‌బిఎస్ రూ.540 కోట్లు, పిఎఫ్ రూ.1,270 కోట్లు, ఎస్‌బిటి రూ. 140 కోట్లు చెల్లించాలని చెప్పారు. రిటైర్ అయిన కార్మికులకు చెల్లించాల్సిన టెర్మినల్ బెనిఫిట్స్ తక్షణం చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో కన్వీనర్ వివిస్ రావు, నాయకులు ఎమ్ఎన్ మంగ, కె రాంరెడ్డి, పి రవీందర్ రెడ్డి, జి రాములు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ విద్యార్థులకే 'కాంపిటెంట్ అథారిటీ' సీట్లు : హైకోర్టు తీర్పు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
తెలంగాణలోని వైద్య కళాశాలల్లో స్థానిక విద్యార్థులకు రిజర్వేషన్ అంశంపై హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. స్థానిక విద్యార్థులకు రిజర్వేషన్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను ఈ సందర్భంగా న్యాయస్థానం సమర్థించింది. కాంపిటెంట్ అథారిటీ కోటా సీట్లన్నీ రాష్ట్ర విద్యార్థులకేనని ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆలిండియా కోటాలో 15 శాతం పోగా మిగిలినవన్నీ తెలంగాణ వారికేనని ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు జిఒ 72ను సవాల్ చేస్తూ పలువురు ఎపి విద్యార్థులు పిటిషన్ వేశారు. వీటిపై విచారణ చేపట్టిన హైకోర్టు తాజాగా సోమవారం తీర్పును వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్ విద్యార్థుల పిటిషన్‌లను కొట్టివేసింది.

సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కర్ణన్

నల్లగొండ ప్రభుత్వాస్పత్రిలో అగ్ని ప్రమాదం

- కిటికీ అద్దాలను ధ్వంసం చేసి పొగను బయటికి పంపిన ఫైర్ సిబ్బంది
- సంఘటనా స్థలాన్ని సందర్శించిన కలెక్టర్ కర్ణన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
నల్లగొండ ప్రభుత్వాస్పత్రిలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో సోమవారం అగ్ని ప్రమాదం జరిగింది. ఉదయం 7.30 గంటల సమయంలో పసిపిల్లల వార్డులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో బాలింతలు, గర్భిణీలు బయటకు పరుగులు తీశారు. ఒక్కసారిగా పొగ కమ్ముకుంది. పేషెంట్లు, బంధువులు, కుటుంబ సభ్యులు పసిపిల్లలను చేతులతో ఎత్తుకుని బయటకు వెళ్లారు. ఫైర్ సిబ్బంది కిటికీ అద్దాలను ధ్వంసం చేసి పొగను బయటికి పంపించారు. అగ్నిప్రమాదం కెమికల్ రియాక్షన్ వల్లే జరిగిందని ఆస్పత్రి సూపరింటెండెంట్ లచ్చు నాయక్ తెలిపారు. రోగులకు ఎలాంటి ఇబ్బందీ జరగలేదని, సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి వచ్చి మంటలను ఆర్పేసినట్టు చెప్పారు. అగ్ని ప్రమాదంతో సుమారు రూ.80 వేల నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. అందులో బిల్డింగ్, గ్లాస్, ఫర్నీచర్, ల్యాబ్, యాసిడ్ ఫినాయిల్ టిన్స్, బ్లీచింగ్ పౌడర్ బ్యాగులు, శానిటైజర్, శానిటేషన్ సామాగ్రి కాలిపోయాయి. ఆస్పత్రి మాతా శిశు కేంద్రం సబ్ స్టోర్ రూంలో మంటలు వచ్చిన విషయం తెలియగానే కలెక్టర్ అర్‌వి కర్ణన్ సూపరింటెండెంట్‌తో మాట్లాడారు. అనంతరం ఆస్పత్రిని సందర్శించి మాతా శిశు కేంద్రం సబ్ స్టోర్ రూంను పరిశీలించారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం జరగ లేదని సూపరింటెండెంట్ చెపాపరు. బాత్రూం క్లీనర్ సల్ఫ్యూరిక్ ఆసిడ్ ద్రావణంలో బ్లీచింగ్ పౌడర్ కలవడం వల్లే ప్రమాదం జరిగినట్టు కలెక్టర్‌కు చెప్పారు.

అదనపు ఒపిలు ప్రారంభించాలి.

మాతా శిశు కేంద్రంలో ఒపిలో పెద్ద ఎత్తున మహిళలు లైన్‌లో ఉండటాన్ని చూసిన కలెక్టర్.. అదనంగా రెండు మూడు ఒపి కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూపరింటెండెంట్ డా లచ్చు నాయక్‌ను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా కొండల్‌రావు తదితరులు ఉన్నారు.

ఇళ్లు, ఇళ్ల స్థలాల కోసం పోరు : సిపిఎం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
ఇండ్లు, ఇండ్ల స్థలాల సాధన కోసం పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి.సాగర్ కోరారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాజకీయ శిక్షణ తరగతులను సోమవారం ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం ఆవాస్ యోజన పథకం కింద ఇండ్లు నిర్మించి ఇస్తామంటూ మాయమాటలు చెప్పిందని విమర్శించారు. ఇప్పుడు వాటి ప్రస్తావనే మరిచిందని తెలిపారు. నిజమైన లబ్ధిదారులకు రాష్ట్రంలో పూర్తిస్థాయిలో ఎక్కడా ఆవాస్ యోజన పథకం కింద ఇండ్ల నిర్మాణం జరిగిందో చెప్పాలని ప్రశ్నించారు. పేదలు నిర్మించుకున్న గుడిసెల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధం ప్రయోగిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. గుడిసెవాసులపై కేసులు బనాయిస్తూ, నిరంకుశంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. నెలల తరబడి పేదలు ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని, నివాసాలు ఉంటున్నారని తెలిపారు. వారిని అర్హులుగా గుర్తించి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కూడా నిజమైన లబ్ధిదారులకు అందడం లేదని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్నవారందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన లక్షల మంది నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లకేటాయించాలనీ, అవినీతి జరగకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే..రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

కాంట్రాక్ట్ ఎఎన్ఎంల సమస్యలను పరిష్కరించాలి

- టియుఎంహెచ్ఇయు

ఎఎన్ఎంల సమస్యలపై వేసిన ఉన్నతాధికారుల కమిటీకి వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో
కాంట్రాక్ట్ ఎఎన్ఎంల సమస్యలను పరిష్కరించాలి. వారి సేవలను క్రమబద్ధీకరించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టియుఎంహెచ్ఇయు-సిఐటియు అనుబంధం) కోరింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ ఫసియొద్దీన్, కె.యాదానాయక్, రాష్ట్ర కోశాధికారి ఎ.కవిత తదితరులు ఎఎన్ఎంల సమస్యలపై వేసిన ఉన్నతాధికారుల కమిటీ చైర్‌పర్సన్ హైమావతి, సభ్యులు డాక్టర్ కె రమేశ్‌రెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్ట్ ఎఎన్ఎంలను యధావిధిగా రెగ్యులర్ చేయాలనీ, పరీక్ష కోసం వేసిన నోటిఫికేషన్ రద్దు చేయాలనే డిమాండ్లతో ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 4 వరకు జరిగిన సమ్మె కాలంలో రెండుసార్లు చర్చలు జరిగిన విషయాన్ని గుర్తుచేశారు. సెప్టెంబర్ ఒకటిన చర్చల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ముగ్గురితో కమిటీ వేశారనీ, దీనితో న్యాయం జరుగుతుందనే ఆశతో సెప్టెంబర్ 4న సమ్మె విరమించినట్టు చెప్పారు.

ఉమ్మడి రాష్ట్రంలో 2003 నుంచి దాదాపు 15 నుంచి 20 సంవత్సరాల సర్వీసును కాంట్రాక్ట్ ఎఎన్ఎంలు పూర్తి చేసుకున్నారని తెలిపారు. మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్, రాతపరీక్ష, ఇంటర్వ్యూల ఆధారంగా డిస్ట్రిక్ట్ సెలెక్ట్ కమిటీ ద్వారా నియమితులైన వారిలో అత్యధిక మందికి వయోపరిమితి దాటిపోయిందని తెలిపారు. రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగా జాబ్‌చార్ట్‌తో పని చేస్తున్నారని తెలిపారు. వీరిలో 2వ ఎఎన్ఎంలు 3,958 మంది, ఈసీ ఎఎన్ఎంలు 644, ఎన్‌వీహెచ్ఎం 841, ఆర్‌బిఎస్ఎల్ 269, అవుట్‌సోర్సింగ్ ద్వారా 1,083, హెచ్ఆర్‌డి47, 104 ఎఎన్ఎంలు 20 మంది పని చేస్తున్నారని తెలిపారు.

పిఆర్‌సి ప్రకారం ఎంపీహెచ్ఎ (ఎఫ్) క్యాడర్ బేసిక్ రూ.31,040లుగా నిర్ణయించినప్పటికీ కాంట్రాక్ట్ ఎఎన్ఎంలకు ఇవ్వకుండా రూ.27 వేలు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. బేసిక్‌తో పాటు డీఏ, హెచ్ఆర్ఏ ఇతర అలవెన్సులు ఇవ్వాలని కోరారు. కాంట్రాక్ట్ ఎఎన్ఎంలందరికి ఒకే రకమైన వేతనం ఇవ్వాలని సూచించారు.

కాంట్రాక్ట్ ఎఎన్ఎంలకు రాత పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు 30 మార్కుల వెయిటేజీ ఇచ్చినప్పటికీ రెగ్యులర్ కావడానికి అవకాశం లేదని తెలిపారు. ఆరు వేల మంది ఉద్యోగులుంటే పోస్టులు 1,931 మాత్రమే ఇచ్చారని తెలిపారు. కాంట్రాక్ట్ ఏఎన్ఎంలకు వయోపరిమితి ఎత్తివేయాలని కోరారు. అర్బన్ హెల్త్ సెంటర్ల ఎఎన్ఎంలకు పూర్తి సర్వీసుకు డిఎంహెచ్ఒల ద్వారా సర్వీస్ సర్టిఫికెట్లు, అపాయింట్ మెంట్ ఆర్డర్ కాపీలివ్వాలని విజ్ఞప్తి చేశారు. దరఖాస్తు, రాత పరీక్ష తేదీలను పొడిగించాలని కోరారు.

"ఎఎన్ఎంలకు యువిన్, ఎన్‌సీడీ పనులను రద్దు చేయాలి. హైదరాబాద్ నగరంలో ఐదువేల జనాభాకు ఒక ఎఎన్ఎంను నియమించాలి. పని వేళల్లో మాత్రమే జూమ్ మీటింగ్ నిర్వహించాలి. మిగతా సమావేశాలు సైతం పని వేళల్లో మాత్రమే జరపాలి. సాయంత్రం నాలుగు గంటల తర్వాత ఎలాంటి సమావేశాలు పెట్టరాదు. పై అధికారులు ఫోన్లు చేయరాదు. ప్రభుత్వ మెటర్నిటీ ఆస్పత్రుల్లో టెలిమనాస్ కార్యక్రమం నుంచి ఎఎన్ఎంలను మినహాయించాలి. ఆరోగ్య మహిళా కార్యక్రమానికి ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. తక్కువ జీతాలు వస్తున్న 47 మంది హెచ్ఆర్డీ ఏఎన్ఎంలు, 104 ఏఎన్ఎంలను ఎన్‌హెచ్ఎంలో కలపాలి. ఈసీ ఏఎన్ఎంలకు ఐడీ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలి. ఈసీ ఏఎన్ఎంలకు ప్రతి నెలా మొదటి వారంలో జీతాలివ్వాలి. కాంట్రాక్ట్ ఏఎన్ఎంలకు పీఆర్సీ ఎరియర్స్ వెంటనే చెల్లించాలి. కొత్త జిల్లాల్లోని స్థానికత ఆధారంగా బదిలీలకు అవకాశం కల్పించాలి. వ్యాక్సిన్ అలవెన్స్ రూ.500, యూనిఫాం అలవెన్స్ రూ.2,500 ఇవ్వాలి. 180 రోజుల వేతనంతో కూడిన మెటర్నిటీ లీవులు, మెడికల్ లీవులివ్వాలి. నైట్, ఓపీ డ్యూటీలు రద్దు చేయాలి. విధి నిర్వహణలో చనిపోయిన వారికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి. హెల్త్ కార్డుల జారీ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి. ఫీల్డ్ డ్యూటీ చేస్తున్నందున ఎఫ్‌టీఏ సౌకర్యం కల్పించాలి. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్ నియమించాలి...." అని ఉన్నతాధికారుల కమిటీకి యూనియన్ ప్రతిపాదనలు అందజేసింది.

యూరియా కొరతను నివారించాలి

- ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలి : తమ్మినేని

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో
రాష్ట్రంలో తక్షణం యూరియా కొరతను నివారించి రైతుల్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల రోజుల వర్షాభావం తర్వాత కురుస్తున్న వానలకు రాష్ట్రంలోని మెట్ట, మాగాణి పంటలకు యూరియా అవసరం ఏర్పడిందని తెలిపారు. యూరియా వేయడం జాప్యం చేస్తే పంటల దిగుబడులు తగ్గే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. ప్రతి రైతు యూరియా కోసం రుణాలు తెచ్చి కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. యూరియా కొరత ఉందనే వార్తలు వస్తున్న నేపథ్యంలో రైతులందరికీ అవసరమైనంత అందుబాటులో వుంచాలని డిమాండ్ చేశారు. ఈ పరిస్థితిని గమనించి మార్కెట్‌లో వ్యాపారులు కృత్రిమ కొరతను సృష్టించే అవకాశం ఉందని తెలిపారు. ఒక బస్తా ధర రు.276 ఉండగా, నల్గొండ జిల్లాలో రు.100కు అదనంగా అమ్ముతున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం యూరియా బ్లాక్‌మార్కెట్ అవుతున్నదని "లిక్విడ్ యూరియా" (ద్రవరూప యూరియా), నీమ్ కోటెడ్ యూరియాను మార్కెట్‌లోకి తెచ్చింది. కానీ ఈ రెండు ఎరువులలో నత్రజని మూలకాలు తక్కువగా వున్నాయనే ప్రచారం జరగడంతో వాటిపట్ల రైతులు ఆసక్తి కనపర్చడంలేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న ఎరువులను రాష్ట్రంలోని ఎరువుల లాబొరేటరీలో పరీక్షించి అవి నాణ్యమైనవా? కాదా అని తేల్చాలన్నారు. ఆ పని రాష్ట్ర ప్రభుత్వం చేయడం లేదని గుర్తు చేశారు. ఇదే అదునుగా రాష్ట్రంలో ఎక్కువ వాడుకలో వున్న ఎరువులను వ్యాపారులు అధిక ధరకు అమ్మకాలు సాగిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో వానాకాలం పంటలకు 10.50లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కావాలన్నారు. వ్యవసాయ శాఖామంత్రి యూరియా నిల్వలు వున్నాయని చెప్పినప్పటికీ.. అందుబాటులో లేదన్నది వాస్తవమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నాణ్యమైన యూరియాను మండల స్థాయిలో రైతులకు అందుబాటులో పెట్టాలనీ, బ్లాక్‌మార్కెట్‌పై చర్యలు చేపట్టాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నదన్నారు.

కష్టజీవుల రక్తంతో ఏర్పడ్డదే ఎర్రజెండా

- కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు
- ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో గద్దర్ సంస్మరణ సభ

సంస్మరణ సభలో మాట్లాడుతున్న స్కైలాబ్ బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
కమ్యూనిస్టుల పోరాటాలు లేకుండా ప్రజలకు హక్కులు సాధించబడలేదని, ప్రతి సంస్కరణ కమ్యూనిస్టుల పోరాట ఫలితమేనని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో సోమవారం గద్దర్ సంస్మరణ సభ, ఆటా-పాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎర్రజెండా ఒకరు ఏర్పాటు చేసింది కాదని కష్టజీవుల రక్తంతో తడిచి ఏర్పడిందన్నారు. గద్దర్ పీడిత ప్రజల పోరాట గొంతుక అని అన్నారు. తెలుగు ప్రజా సాంస్కృతిక ఉద్యమంలో గద్దర్‌ది అద్వితీయమైన పాత్ర అని తెలిపారు. ప్రజా సమస్యలను పాటగా మలిచి పాలకులకు వెన్నులో వనుకు పుట్టించిన ప్రజా గాయకుడు గద్దర్ అని చెప్పారు.కళాప్రదర్శనల ద్వారా ప్రజలను చైతన్యం చేస్తూ ప్రజల పక్షాన నిలవడమే గద్దర్‌కు మనమిచ్చే ఘనమైన నివాళి అన్నారు. భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన మహోజ్వల పోరాటమే తెలంగాణ సాయుధ పోరాటం అని.. కానీ నేడు మతం పేరుతో చరిత్రను వక్రీకరించే ప్రయత్నం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బండెనక బండి కట్టి అంటూ దొరలు, జాగిర్ధార్లు, రజాకార్ సైన్యాలకు ఎదురొడ్డి నిలిచిన చరిత్రను మతం పేరుతో వక్రీకరించే బిజెపి విధానాలను వ్యతిరేకించాలని కోరారు. మూఢవిశ్వాసాలను మరింతగా పెంచారని, కెసిఆర్ మాటలకు, చేతలకు పొంతన లేకుండా ఉందన్నారు. అసెంబ్లీలో ప్రజల సమస్యలు, కష్టాలు మాట్లాడటం లేదని, వ్యక్తిగత దూషణలతోనే కాలం వెల్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంటేపాక శివ కుమార్, ఈర్లపల్లి ముత్యాలు, నాయకులు దేశపాక రవి, కందుల హనుమంతు, మద్దూరి ఐలయ్య, మండల అధ్యక్ష, కార్యదర్శులు నకిరేకంటి సురేష్, గంటేపాక శ్రీకాంత్, పండుగ రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.